## దసరా పండుగ సందడి
కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్






# యువ వెలుగు

PRGI: TGTEL/26/A6429

E- Paper, www.yuvavelugu.com

తెలుగు దిన పత్రిక



యువ వెలుగు తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను

మండలం। నియోజకవర్గం। జిల్లా వారీగా రిపోర్టర్లు కావలెను

9908 502 602



సంపుటి : 01 సంచిక : 37 | ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ | శనివారం 10-10-2026 | పేజీలు : 4 ధర :- 02/-


# జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెలలోగా పరిష్కారం

### సీఎం రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి

### దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేశామన్న మంత్రి



**హైదారాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 09** : తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు.

ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని పొంగులేటి వెల్లడించారు.

సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఏ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని... 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొంది 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.



# సీజేపీ నిరసన సెగ

## ఢిల్లీలో 24 గంటల పాటు ఇంటర్నెట్ బంద్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసన
- ఢిల్లీలోని జన్‌పథ్ చుట్టూ 4 కి.మీ. పరిధిలో ఇంటర్నెట్ నిలిపివేత
- శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి 24 గంటల పాటు ఆంక్షలు
- టెలికం సంస్థలకు ఆదేశాలు జారీ చేసిన ఢిల్లీ పోలీసు యంత్రాంగం
- ప్రభుత్వ కఠిన చర్యలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నిర్ణయం

**న్యూఢిల్లీ** : చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) రేపు తలపెట్టిన నిరసన కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా కఠిన ఆంక్షలు విధించారు. జన్‌పథ్-కర్తవ్య పథ్ కూడలికి నాలుగు కిలోమీటర్ల పరిధిలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను 24 గంటల పాటు నిలిపివేయాలని శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 9, శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ మేరకు ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియా, జియో, ఎంటీఎన్ఎల్ వంటి ప్రధాన టెలికం సంస్థలకు అధికారిక ఉత్తర్వులు వెళ్లాయి. టెలికమ్యూనికేషన్స్ చట్టం-2023లోని నిబంధనల ప్రకారం ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలన్న తాము కోరిన విన్నపాన్ని కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆమోదించినట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్ ఇంటర్నెట్ సేవలను తక్షణమే నిలిపివేయాలని ఆయా సంస్థలను ఆదేశించారు. కాగా, ఈ పరిణామం చోటుచేసుకోవడానికి కొన్ని గంటల ముందే నిరసనల అణిచివేతకు ⏭ తరువాయి 2లో..

## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ** : విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల మిగతా 2లో



## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?: కిషన్ రెడ్డి

### ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి

### రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ

### ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటు

**హైదారాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 09** : కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

# తమిళనాడులో సీఎం విజయ్‌కు బూస్ట్

## రెండు ఉప ఎన్నికల్లోనూ టీవీకే ఘన విజయం!

- మదురాంతకంలో మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం
- ధారాపురంలో 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచిన సత్యభామ
- అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో అనివార్యమైన ఉపఎన్నికలు
- 4 నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతల అభివర్ణన
- ఈ విజయాలతో విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా ఊరట



**తమిళనాడు, యువ వెలుగు, అక్టోబర్ 09** : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఉప ఎన్నికల్లో భారీ విజయం దక్కింది. మధురాంతకం, ధారాపురం అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. రెండు స్థానాల్లోనూ ప్రధాన ప్రత్యర్థి డీఎంకే రెండో స్థానానికే పరిమితమైంది. ఈ ఫలితాలు విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని ఇచ్చాయి. మధురాంతకం నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమరవేల్ ⏭ తరువాయి 2లో..

## అన్ని అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా..

## భద్రతా వలయంలో ఢిల్లీ!



**న్యూఢిల్లీ** : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, ⏭ తరువాయి 2లో..

# భారత్‌ను 'స్పేస్ పవర్'గా మార్చిన 8 చారిత్రాత్మక మిషన్లు ఇవే..!

- 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభట ప్రయోగం
- ఇన్‌శాట్‌తో టీవీ, సమాచార సేవలకు ఊతం
- పీఎస్ఎల్‌వీతో పెరిగిన భారత్ ప్రయోగ సామర్థ్యం
- చంద్రయాన్-1తో చంద్రుడిపై నీటి ఆనవాళ్లకు ఆధారాలు
- మంగళయాన్‌తో అంగారకుడి కక్ష్యలోకి భారత్
- ఆదిత్య ఎల్1తో సూర్యుడిపై పరిశోధనలు



'భారత అంతరిక్ష పరిశోధన సంస్థ' (ఇస్రో) ప్రయాణం ఎన్నో అద్భుత విజయాలతో సాగుతోంది. 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభటను ప్రయోగించిన భారత్.. ఇప్పుడు చంద్రుడిపై పరిశోధనలు, అంగారకుడి అన్వేషణ, సూర్యుడి అధ్యయనం చేసే స్థాయికి చేరింది. ఉపగ్రహ సాంకేతికతతో మొదలైన ఈ ప్రయాణం.. ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. అక్టోబర్ 4 నుంచి 10 వరకు 'ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు' జరుగుతున్న నేపథ్యంలో ఇస్రో సాధించిన ఎనిమిది కీలక మైలురాళ్లపై ఓ లుక్కేద్దాం.

**1. ఆర్యభట:** భారత అంతరిక్ష ప్రయాణానికి తొలి అడుగు 1975 ఏప్రిల్ 19న ఆర్యభట ఉపగ్రహాన్ని భారత్ ప్రయోగించింది. ఇస్రో రూపొందించిన ఈ ఉపగ్రహాన్ని సోవియట్ యూనియన్ సహకారంతో అంతరిక్షంలోకి పంపారు. ఎక్స్-రే ఖగోళ శాస్త్రం, సూర్యుడి అధ్యయనం, వాతావరణంపై పరిశోధనలకు ఇది ఉపయోగపడింది. భారత అంతరిక్ష పరిశోధనలకు ఇదే పునాది వేసింది.

**2. ఇన్‌శాట్:** ప్రజలకు చేరువైన అంతరిక్ష సాంకేతికత ఇన్‌శాట్ ఉపగ్రహ వ్యవస్థ దేశంలో టెలికమ్యూనికేషన్లు, టీవీ ప్రసారాలు, ⏭ తరువాయి 2లో..



## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త : సజ్జనార్ హెచ్చరిక!

### ట్యాంక్‌బండ్, చెరువులు, పార్కుల వద్ద కేక్ కటింగ్‌లు చేయొద్దని సూచన
### ట్యాంక్‌బండ్ ప్రమాదంలో చిన్నారి, ఆమె బంధువు మృతి
### రోడ్లపై వేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిక
### ఇళ్లలో లేదా సురక్షిత ప్రదేశాల్లోనే పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలని సూచన
### ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిషేధించినట్లు తెలిపిన పోలీస్ కమిషనర్

**హైదారాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 09** : అర్ధరాత్రి వేళ రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌తో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు చేయొద్దని స్పష్టం చేశారు. సరదా కోసం చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె బంధువు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి ⏭ తరువాయి 2లో..

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

## ఇది మా విధానం: టీడీపీ

**అమరావతి, యువ వెలుగు, అక్టోబర్ 09** :సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తెలుగుదేశం పార్టీ తన విధానాన్ని స్పష్టం చేసింది. చట్టపరమైన ఆమోదం లభించకపోయినా, పార్టీ తరఫున బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి వారి రాజకీయ గౌరవాన్ని కాపాడతామని కీలక ప్రకటన చేసింది. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు జీవో 105, 1065 ద్వారా 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం చేశామని, అయితే వైసీపీ నేతలు కోర్టులకు వెళ్లడం వల్లే హైకోర్టు ఆ జీవోలను కొట్టివేసిందని టీడీపీ ఆరోపించింది.

ఈ విషయంలో తాము వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టును ఆశ్రయించామని, సీనియర్ న్యాయవాదులను నియమించి పోరాడినా దురదృష్టవశాత్తు అనుకూల తీర్పు రాలేదని తెలుగుదేశం పార్టీ గుర్తుచేసింది. అయినా సరే, బీసీల విషయంలో తమ నిబద్ధతను చాటుకుంటామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపరంగా 34 శాతానికి తగ్గకుండా బీసీ వర్గాలకు సీట్లు కేటాయిస్తామని ఉద్ఘాటించింది. బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారికి న్యాయం చేయడమే తమ లక్ష్యమని, కానీ వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి అని విమర్శించింది. కుట్రలు చేసి, కోర్టులకు వెళ్లి రిజర్వేషన్లు పోయేలా చేసి, మళ్లీ తమపైనే ఆరోపణలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టింది. నాడు హైకోర్టు రిజర్వేషన్లు కొట్టివేసినప్పుడు ⏭ తరువాయి 2లో..

# సీజేపీ నిరసన సెగ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలోకి వచ్చే మెట్రోలు, రైళ్లపై ఆంక్షలు విధించడాన్ని ప్రశ్నిస్తూ, "ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించలేరు కదా" అని ప్రభుత్వాన్ని నిలదీసింది. అత్యున్నత న్యాయస్థానం ఇటువంటి వ్యాఖ్యలు చేసినప్పటికీ, పోలీసులు నిరసనలను అడ్డుకోవడానికి ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించడం గమనార్హం. సీజేపీ నిరసనల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

# బండి నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**అడవిదేవులపల్లి, జాతీయ వార్తా ప్రపంచం, అక్టోబర్ 09 :** మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా బస్టాండ్ సెంటర్ వద్ద ఉచిత స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,స్థానిక యువత అభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. నాయకులు,యువకులు ఉత్సాహంగా పాల్గొని 60 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ నా తోటి కాంగ్రెస్ కార్యకర్తలకు,నన్ను ఆశీర్వదించడానికి వచ్చిన పెద్దలకు, ముఖ్యంగా నా పుట్టినరోజున రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువ సోదరులకు నా హృదయపూర్వక నమస్కారాలు. నా పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి,సంబరాలు చేసుకోవడం కంటే సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా ఒక మంచి పని చేయాలనే ఆలోచనతో మన అడవిదేవులపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద ఈ స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నాం. స్వచ్ఛందంగా వచ్చి 60 మంది పైగా యువకులు, కాంగ్రెస్ శ్రేణులు రక్తదానం చేయడం నాకు ఎంతో సంతోషాన్ని,గర్వాన్ని కలిగిస్తోంది మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం అత్యవసర సమయంలో ఒకరి ప్రాణాన్ని కాపాడుతుంది. అలాంటి ప్రాణదానంలో భాగస్వాములైన నా యువ సోదరులందరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజా సేవ,పేదల సంక్షేమం. ప్రజాసేవే ధ్యేయంగా రాబోయే రోజుల్లో కూడా మన మండలంలో మరిన్ని సేవ కార్యక్రమాలు,అభివృద్ధి పనులు చేపడతానని అన్నారు. నాపై ఇంతటి ప్రేమాభిమానాలను చూపి,ఈ రక్తదాన శిబిరాన్ని ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# తమిళనాడులో సీఎం విజయ్‌కు బూస్ట్

(మొదటి పేజీ తరువాయి)

17,554 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమెకు 61,470 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌కు 43,916 ఓట్లు వచ్చాయి. అన్నాడీఎంకే అభ్యర్థి గణిత సంపత్ 38,770 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 27 మంది పోటీ చేయగా, 86.26 శాతం పోలింగ్ నమోదైంది. ధారాపురంలోనూ టీవీకే అభ్యర్థి సత్యభామ విజయకేతనం ఎగురవేశారు. ఆమెకు 62,596 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి సుకన్యకు 52,400 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యభామ 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి భానుమతి 41,078 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక్కడ 22 మంది అభ్యర్థులు పోటీ చేయగా, 80.30 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గతంలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. దీంతో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. టీవీకే, డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు వామపక్షాలు, నామ్ తమిళర్ కట్చి కూడా పోటీలో నిలిచాయి. ఈ విజయాలు తమ ప్రభుత్వం గత నాలుగు నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతలు అభివర్ణించారు.

# దసరా సెలవులతో హైదరాబాద్ బస్టాండ్లలో పెరిగిన ప్రయాణికుల రద్దీ

**రాష్ట్రవ్యాప్తంగా 7,000 ప్రత్యేక బస్సులను నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ**

**ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలపై 50 శాతం అదనం**

**మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం యథాతథం**

**ప్రయాణికుల కోసం ప్రధాన టెర్మినల్లలో అదనపు సౌకర్యాల ఏర్పాటు**

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 9 :** దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి.

పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి.

అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్న వైసీపీ, బీసీలకు న్యాయం చేసేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదని ఆక్షేపించింది.

**బీసీలకు అండగా నిలిచింది టీడీపీనే ..**

బీసీలకు రాజ్యాధికారం అనే మాటను తొలిసారిగా పలికి, వారికి అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని ఈ సందర్భంగా టీడీపీ గుర్తుచేసింది. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ కారణంగా నాలుగు దశాబ్దాల క్రితమే బీసీల గళం వినిపించిందని, ఆ తర్వాత తాము ఆ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లామని తెలిపింది. 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచిన ఘనత తమదేనని పేర్కొంది. బీసీలు తమకు అండగా ఉన్నారనే అక్కసుతోనే గత వైసీపీ ప్రభుత్వం వారిని అణగదొక్కే ప్రయత్నం చేసిందని, 30 ఏళ్లుగా అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఆరోపించింది. దీనివల్ల సుమారు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేసింది.

**గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీలకు మేలు**

బీసీ ఫెడరేషన్లకు నాంది పలికింది కూడా తమ ప్రభుత్వమేనని టీడీపీ తెలిపింది. కులవృత్తులు, చేతివృత్తులను పరిరక్షించేందుకు, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు 'ఆదరణ' వంటి పథకాలను తీసుకువచ్చామని, ఈ పథకం కింద 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించామని గుర్తుచేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించింది. ఇందులో భాగంగా వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు, గీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించామని తెలిపింది.

'నేతన్న సేవ' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని, చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని తామే ప్రారంభించామని, ఇప్పుడు 'మత్స్యకార సేవ' పథకం కింద ఆ సహాయాన్ని రూ.20,000కు పెంచామని వివరించింది. సబ్సిడీపై బోట్లు, డీజిల్ అందిస్తూ, తీరప్రాంతంలో వారి హక్కులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపింది. గత ప్రభుత్వం అన్యాయంగా తెచ్చిన జీవో నెంబర్ 217ను రద్దు చేసి మత్స్యకార సొసైటీల హక్కులను కాపాడామని, మత్స్యకార మహిళలకు సీ వీడ్ పెంపకంపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పింది. నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, దేవాలయాల్లో పనిచేసే వారికి భృతిని రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచామని తెలిపింది. స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని పేర్కొంది. చట్టపరంగా ఏది ఏమైనప్పటికీ, రాజకీయంగా బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకుంటామని టీడీపీ పునరుద్ఘాటించింది.

# భద్రతా వలయంలో ఢిల్లీ!

(మొదటి పేజీ తరువాయి)

పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్‌ం భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు.

# అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త : సజ్జనార్ హెచ్చరిక!

(మొదటి పేజీ తరువాయి)

పుట్టినరోజు వేడుకల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని సజ్జనార్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌లో ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని, సంబంధిత ప్రభుత్వ శాఖలతోనూ సమీక్ష నిర్వహించామని వెల్లడించారు. అర్ధరాత్రి వేళ రోడ్లపై పాదచారుల రాకపోకలు తక్కువగా ఉండటంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయని సజ్జనార్ హెచ్చరించారు.

# విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.ఖ

# భారత్‌ను 'స్పేస్ పవర్'గా మార్చిన 8 చారిత్రాత్మక మిషన్లు ఇవే..!

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణ అంచనాలు, విద్యా కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడింది. అంతరిక్ష సాంకేతికతను సామాన్య ప్రజల అవసరాలకు చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించింది.

**3. పీఎస్ఎల్వీ: ఇస్రోకు నమ్మకమైన రాకెట్**

'పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్' (పీఎస్ఎల్వీ) 1994లో తొలి విజయవంతమైన ప్రయోగం తర్వాత ఇస్రోకు ప్రధాన రాకెట్‌గా ఎదిగింది. భారత ఉపగ్రహాలతో పాటు విదేశీ ఉపగ్రహాలను కూడా అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. చంద్రయాన్-1, మంగళయాన్ ప్రయోగాల్లోనూ కీలక పాత్ర పోషించింది.

**4. చంద్రయాన్-1: చంద్రుడిపై నీటి ఆనవాళ్లకు ఆధారాలు**

2008 అక్టోబర్ 22న భారత్ తొలి చంద్రయాన్ ప్రయోగాన్ని చేపట్టింది. ఇందులో 11 శాస్త్రీయ పరికరాలు ఉన్నాయి. చంద్రుడి ఉపరితలాన్ని పరిశీలించిన ఈ మిషన్.. అక్కడ నీటి అణువులు, హైడ్రాక్సిల్ ఆనవాళ్లపై కీలక ఆధారాలను అందించింది. చంద్రుడిపై నీటి ఉనికిపై శాస్త్రవేత్తల అవగాహనను ఇది మార్చింది.

**5. మంగళయాన్: అంగారకుడి కక్ష్యలోకి భారత్**

2013లో ప్రయోగించిన మార్స్ ఆర్బిటర్ మిషన్.. మంగళయాన్‌గా ప్రసిద్ధి చెందింది. తొలి ప్రయత్నంలోనే అంగారకుడి కక్ష్యలోకి చేరిన భారత్.. ఈ ఘనత సాధించిన తొలి ఆసియా దేశంగా నిలిచింది. అంగారకుడి ఉపరితలం, వాతావరణంపై అధ్యయనం చేయడంలో ఈ మిషన్ కీలకమైంది.

**6. చంద్రయాన్-2: వైఫల్యంలోనూ విలువైన పరిశోధనలు**

2019 జూలై 22న ప్రయోగించిన చంద్రయాన్-2లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్ ఉన్నాయి. ల్యాండర్ చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ సాధించలేకపోయినా.. ఆర్బిటర్ తన పరిశోధనలను కొనసాగించింది. చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని అందించింది. ఈ అనుభవం తర్వాతి చంద్రయాన్-3 మిషన్‌కు ఉపయోగపడింది.

**7. చంద్రయాన్-3: చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్**

2023 ఆగస్టు 23న చంద్రయాన్-3 ల్యాండర్ చంద్రుడిపై విజయవంతంగా దిగింది. దీంతో చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో ల్యాండర్, రోవర్ శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించాయి. ఈ విజయంతో ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ స్థానం మరింత బలపడింది.

**8. ఆదిత్య ఎల్1: సూర్యుడి రహస్యాలను తెలుసుకునే యత్నం**

2023 సెప్టెంబర్ 2న ఇస్రో ఆదిత్య ఎల్1ను ప్రయోగించింది. ఇది భారత్ చేపట్టిన తొలి అంతరిక్ష ఆధారిత సూర్యుడి పరిశీలన మిషన్. భూమికి సుమారు 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉండి సూర్యుడి వెలుపలి పొరలు, సౌర గాలులు, సౌర తుపాన్లను అధ్యయనం చేయడం దీని లక్ష్యం. ఆర్యభటతో మొదలైన భారత అంతరిక్ష ప్రయాణం.. చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్, సూర్యుడి అధ్యయనం వరకు విస్తరించింది. శాస్త్రీయ పరిశోధనలతో పాటు సమాచార వ్యవస్థలు, వాతావరణ అంచనాలు, అంతరిక్ష సాంకేతికతలో స్వావలంబన సాధించడంలో ఇస్రో కీలక పాత్ర పోషిస్తోంది.

# రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి - సంజయ్ దాస్ గౌడ్

**చిట్యాల, యువ వెలుగు, అక్టోబర్ 09 :** ఎల్ నినో సాకుతో బియ్యానికి కృత్రిమ కొరత సృష్టిస్తున్న మిల్లర్లు, వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మలి దశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కునూరు సంజయ్ దాస్ అన్నారు. ఈ విషయంపై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా బియ్యం ధరలు అమాంతం పెరిగి సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడిందని, కొంతమంది మిల్లర్లు, దళారులు కలిసి కొరత ఉన్నట్లు భ్రమ కల్పించి ధరలు పెంచి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేస్తున్న వారిపై విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలను నియంత్రించి సామాన్యులకు న్యాయమైన ధరకు బియ్యం అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

# అమరుల స్ఫూర్తితోనే ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తాం..

## టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్

**సూర్యాపేట/తుంగతుర్తి, యువ వెలుగు, అక్టోబర్ 09 :** తెలంగాణ రాష్టంలో ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగాలు విలువైనవి అని వారి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తాం అని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, తుంగతుర్తి నియోజవర్గం ఇంచార్జి సూరారపు కృష్ణవేణి అన్నారు. గురువారం మండల కేంద్రంలో టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుంట్ల కవితమ్మ ఆదేశానుసారం తుంగతుర్తి నియోజవర్గంలో పాంచజన్యం సంకల్ప సభలు, సామాజిక న్యాయ సమావేశాలు ఊరూర నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నియోజకవర్గం నేతలు పిట్టల మహేష్, నకిరేకంటి చిరంజీవి, ధారావత్ ప్రవీణ్ నాయక్ రేణుక, వంశీ, సంపత్ జిల్లా, నియోజక మండల నాయకులు పాల్గొన్నారు.

# గణితానికి నోబెల్ బహుమతి ఎందుకు లేదు? ప్రేమ వ్యవహారమే కారణమా?

**1895లో తన వీలునామా ద్వారా నోబెల్ బహుమతులకు పునాది వేసిన ఆల్ఫ్రెడ్ నోబెల్**

**గణితాన్ని అవార్డులు అందజేయాల్సి రంగాల జాబితాలో చేర్చని ఆల్ఫ్రెడ్**

**ఓ ప్రేమ వ్యవహారమే కారణమన్న కథ చాలా కాలంగా ప్రచారం**

**ఆల్ఫ్రెడ్ నోబెల్ ప్రేమించిన మహిళను ఓ గణిత శాస్త్రవేత్త ఇష్టపడ్డాడని ప్రచారం**

**దీనికి అధికారికంగా ఎలాంటి ఆధారాలు లేకపోవడం గమనార్హం**



ప్రపంచాన్ని మార్చే గొప్ప ఆవిష్కరణలు, పరిశోధనలకు నోబెల్ బహుమతులు ఇస్తారు. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వైద్యం, సాహిత్యం, శాంతి, ఆర్థిక రంగాల్లో ఈ పురస్కారాలను అందిస్తారు. కానీ ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలకు పునాది అయిన గణితానికి మాత్రం నోబెల్ బహుమతి లేదు. అసలు ఈ సబ్జెక్టును నోబెల్ అవార్డుల జాబితాలో ఎందుకు చేర్చలేదు? దీని వెనుక ఓ ప్రేమ వ్యవహారం ఉందన్న ప్రచారంలో నిజమెంత?

స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, డైనమైట్ ఆవిష్కర్త ఆల్ఫ్రెడ్ నోబెల్ 1895లో తన వీలునామా ద్వారా నోబెల్ బహుమతులకు పునాది వేశారు. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వైద్యం, సాహిత్యం, శాంతి రంగాల్లో మానవాళికి గొప్ప ప్రయోజనం కలిగించే కృషి చేసినవారికి తన సంపద నుంచి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. 1901లో తొలిసారి ఈ పురస్కారాలను అందించారు. అయితే, గణితాన్ని ఎందుకు చేర్చలేదో నోబెల్ స్పష్టమైన కారణాన్ని ఎక్కడా నమోదు చేయలేదు.

గణితానికి నోబెల్ బహుమతి లేకపోవడానికి ఓ ప్రేమ వ్యవహారమే కారణమన్న కథ చాలా కాలంగా ప్రచారంలో ఉంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ప్రేమించిన మహిళను ఓ గణిత శాస్త్రవేత్త ఇష్టపడ్డాడని, అందుకే ఆయన గణితాన్ని అవార్డుల జాబితా నుంచి తప్పించారన్నది ఈ కథ సారాంశం. అయితే, దీనికి చారిత్రక ఆధారాలు లేవు. అంతేకాదు, ఆల్ఫ్రెడ్ నోబెల్ అసలు పెళ్లి చేసుకోలేదు. ఆయన జీవితంలో కొన్ని ప్రేమ సంబంధాలు ఉన్నప్పటికీ, ప్రేమలో గణిత శాస్త్రవేత్తతో పోటీ కారణంగా ఆ రంగాన్ని పక్కన పెట్టారనే వాదనకు విశ్వసనీయమైన ఆధారాలు లేవు. గణితాన్ని నోబెల్ ఎందుకు చేర్చలేదనే ప్రశ్నకు కచ్చితమైన సమాధానం ఇప్పటికీ లేదు. ఆయనకు ఆ రంగంపై ఆసక్తి లేదని, గణితం తక్కువ ప్రాధాన్యం ఉన్న సబ్జెక్టు అని భావించారని చెప్పడానికి కూడా ఆధారాలు లేవు. గణితం ద్వారా వచ్చే ప్రయోజనాలు తరచూ భౌతికశాస్త్రం, వైద్యం, ఇంజినీరింగ్ వంటి రంగాల్లో కనిపిస్తాయి. అందువల్ల గణిత పరిశోధనల ప్రభావాన్ని ప్రత్యేకంగా గుర్తించడం కొంత భిన్నంగా ఉండొచ్చు. అయితే, ఇది కూడా నోబెల్ తీసుకున్న నిర్ణయానికి నిర్ధారిత కారణం కాదు. అయితే, గణిత శాస్త్రవేత్తలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఇచ్చే ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఉన్నాయి. 1936లో ప్రారంభమైన ఫీల్డ్స్ మెడల్ నాలుగేళ్లకోసారి అందిస్తారు. అవార్డు ఇచ్చే ఏడాది జనవరి 1 నాటికి 40 ఏళ్లలోపు ఉన్న గణిత శాస్త్రవేత్తలు దీనికి అర్హులు. 2003లో తొలిసారి అందించిన అబెల్ ప్రైజ్ కూడా గణితంలో అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారాల్లో ఒకటి. దీనికి వయోపరిమితి లేదు. వీటిని గణితానికి నోబెల్ బహుమతులుగా కొందరు అభివర్ణించినా, ఇవి నోబెల్ అవార్డులు కావు.

గణితం లేకుండా కృత్రిమ మేధ, వాతావరణ అంచనాలు, వైద్య పరీక్షలు, అంతరిక్ష పరిశోధనలు ముందుకు సాగడం కష్టం. అందుకే గణితానికి నోబెల్ బహుమతి లేకపోవడం ఆ సబ్జెక్టుకు ప్రాధాన్యం లేదని అర్థం కాదు. నోబెల్ తన వీలునామాలో తీసుకున్న నిర్ణయం వెనుక అసలు కారణం మాత్రం చరిత్రలో ఇప్పటికీ స్పష్టంగా తెలియని అంశంగానే మిగిలిపోయింది.

# దసరా నవరాత్రులకు ముస్తాబవుతన్న శ్రీ వన దుర్గ ఆలయం

**మేళ్లచెరువు, యువ వెలుగు, అక్టోబర్ 09 :** మేళ్లచెరువు గ్రామంలో శ్రీ వనదుర్గా అమ్మవారి దేవస్థానంలో 28 సంవత్సరం అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవములు ప్రారంభమవుతున్నట్లు పరాశక్త్యాంబ సహిత పరమశివానంద నాథులు చండీ పీఠాధిపతి కొంకపాక రాధాకృష మూర్తి సీత కుమారి తెలిపారు. 11వ తారీఖు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని. ఉదయము 9 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనము, రక్షాబంధనం దీక్షాధారణతోటి ప్రారంభమై అమ్మవారికి 60 లీటర్ల పాలతోటి అభిషేకము, అనంతరము రజిత కవచాలంకృత అమ్మవారి దర్శనం ఇస్తారు. ఆ రోజు నుంచి ప్రతిరోజు సాయంత్రం అమ్మవారికి శ్రీ చక్రార్చన కార్యక్రమం ఉంటుంది. ప్రతిరోజు అమ్మవారికి విశేష అలంకరణతో పాటు విశేష పూజలు మరియు పంచాయతన పూర్వక వనదురా మహావిద్య రాజషామల శూలిన దుర్గా మరియు ప్రత్యంగిరీ దశమహావిద్య విశేష హోమములు ఉంటాయి. 16వ తారీఖు పిల్లలకి చక్కటి చదువుకోసము సరస్వతి పూజ, రాజశ్యామల హోమం అయిన తర్వాత పిల్లలకు నాలుక మీద బీజాక్షరాలు వేస్తారు. అనంతరం 18/10/2026 నాడు అమ్మవారికి విశేష అహోరాత్ర కుంకుమార్చన శ్రీమాతలు చే కుంకుమార్చన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం దుర్గాష్టమి నాడు అమ్మవారికి విశేషంగా చండీ హోమాలు మరియి 19/10/2026 నాడు అమ్మవారు కాళీదేవి అలంకారంలో దర్శనమిస్తారు.

## శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు



**జనగామ జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 09 :** దేవరుప్పుల మండలంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను విద్యార్థినిలు,ఉపాధ్యాయురాళ్లు బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తోటకూర పాండుకృష్ణ మాట్లాడుతూ బతుకమ్మ పండుగను మన తెలంగాణ రాష్ట్రంలో పూలకు ప్రాధాన్యత నిచ్చే ఏకైక పండుగ అని,అదేవిధంగా బతుకమ్మ అనగా భూమి,నీరు,మానవుల మధ్య అంతర్గత సంబంధాన్ని తెలియజేసేదే ఈ బతుకమ్మ పండుగ అని కొనియాడారు.



## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం, ప్రశంసనీయం

### ఉప్పుల సురేష్ బాబు





**జనగామ జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 09 :** గ్రామాల పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయం,ప్రశంసనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు అన్నారు.బతుకమ్మ పండుగను పురస్కరించుకొని దేవరుప్పుల మండలం,సీతారాంపురం గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది గత వారం రోజుల నుండి గ్రామాన్ని అతిసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయమే లేచి ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలను సేకరిస్తూ,మురుగునీటిని శుభ్రపరుస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని,ప్రజల ఆరోగ్యానికి సహకరిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని,వారి సేవలు భేష్ అని ప్రశంసిస్తూ పారిశుధ్య కార్మికులు దేవుళ్లతో సమానమని,పారిశుధ్య కార్మికుల సేవలను అధికారులు గుర్తించి వారిని సత్కరించాలని కొనియాడారు.

# వృద్ధుల ఆశీర్వాదాలే మా కుటుంబానికి కొండంత బలం: ఏల మంజు సుందర్

**సేవే లక్ష్యం.. వృద్ధుల సంక్షేమమే ధ్యేయం!**

**ఐదేళ్లుగా అనాథ వృద్ధులకు అండగా సుందర్ చారిటబుల్ ట్రస్ట్**

**ప్రేమా సదన్‌లో వృద్ధులకు మందులు, పండ్ల పంపిణీ**

**నెలనెలా రూ.8 వేల నుంచి రూ.10 వేల విలువైన మందుల ఉచితంగా అందజేత**

**మానవత్వానికి మారుపేరుగా ఏల సుందర్ కుటుంబం**





**యువ వెలుగు ప్రతినిధి :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. ఆదరణకు నోచుకోని వృద్ధులకు ఆప్యాయతను పంచడం.. వృద్ధాప్యంలో వారికి అవసరమైన వైద్య సహాయం అందించడం.. లక్ష్యంగా సుందర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ గత ఐదేళ్లుగా సీతారాంపురం గ్రామంలోని ప్రేమా సదన్ అనాథ వృద్ధుల శరణాలయంలో నివసిస్తున్న వృద్ధులకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రూ.8 వేల నుంచి రూ.10 వేల విలువైన మందులను వృద్ధులకు ఉచితంగా అందజేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ సతీమణి ఏల మంజులత ప్రేమా సదన్‌ను సందర్శించి వృద్ధులకు అవసరమైన మందులతో పాటు పండ్లను పంపిణీ చేశారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

**వృద్ధుల దీవెనలే మా కుటుంబానికి ఆశీస్సుల**

తమను ఆదరిస్తూ, అవసరమైన మందులు అందిస్తూ సేవ చేస్తున్న ఏల సుందర్ కుటుంబానికి ప్రేమా సదన్ వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. తమపై చూపుతున్న ప్రేమాభిమానాలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఏల సుందర్ కుటుంబం ఎల్లవేళలా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. సమాజంలో ఆప్యాయతకు నోచుకోని వృద్ధులకు అండగా నిలవడం, వారి అవసరాలను గుర్తించి సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలు కేవలం ఆర్థిక సాయానికే పరిమితం కాకుండా వృద్ధులకు ఆత్మీయతను, భరోసాను అందిస్తున్నాయని తెలిపారు. ఐదేళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాలు మానవత్వానికి, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



## గ్రామ పంచాయతీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపండి

**పెండింగ్ జీతాలు చెల్లించాలి..!అక్రమ తొలగింపులు ఆపాలి..!**

**సర్పంచుల వేధింపులు అరికట్టాలి..!**




**దేవరకొండ, యువ వెలుగు, అక్టోబర్ 09 :** దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలలో గత 10సంవత్సరాలుగా కార్మికులుగా(సఫాయి,మల్టీపర్పస్ వర్కర్స్)నమ్మకంగా విధులు నిర్వహిస్తున్నాము.గ్రామాల పరిశుభ్రత,ప్రజల ఆరోగ్యం కోసం మేము రాత్రింబవళ్ళు కష్టపడుతున్నాము.కానీ,ప్రస్తుతం మేము ఎదుర్కొంటున్న కింది సమస్యల వల్ల మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది:పెండింగ్ జీతాలు:మాకు గత 4నెలల నుండి 10నెలల వరకు జీతాలు రాకుండా పెండింగ్‌లో ఉన్నాయి. దీనివల్ల నిత్యావసరాలు కొనలేక, కుటుంబ పోషణ భారం కాలేదు.అక్రమ తొలగింపులు:ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా,నిబంధనలకు విరుద్ధంగా మమ్మల్ని విధుల్లోంచి అక్రమంగా తొలగిస్తున్నారు. సర్పంచులు, అధికారుల వేధింపులు:స్థానిక సర్పంచులు,అధికారులు మమ్మల్ని మానసికంగా వేధిస్తూ,ఉద్యోగాల నుంచి తీసేస్తామని బెదిరిస్తున్నారు.ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా ఎఐటీయూసీ (తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్)దేవరకొండ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మేము మా నిరసనను, ధర్నాను తెలియజేశారు. వారి ముఖ్యమైన డిమాండ్లు: కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే నిలిపివేయాలి. సర్పంచులు, అధికారుల వేధింపులను అరికట్టాలి.తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. కావున ఆర్డీఓ స్పందించి మాకు న్యాయం చేయాలని, మా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆవేదనతో వేడుకుంటున్నాము. దేవరకొండ నియోజకవర్గ కమిటీ, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఎఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది.

## మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**యాదాద్రి(తుర్కపల్లి), యువ వెలుగు, అక్టోబర్ 09 :** రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తుర్కపల్లి మండలం రాంపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపి కయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 4న నిర్వహించిన వాలీబాల్ సెలక్షన్స్‌లో అండర్-19 విభాగంలో పాఠశా లకు చెందిన ధరావత్ నితిన్, బండ లక్ష్మి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపి కయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అంబటి శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ సతీష్‌కుమార్ విద్యార్థులను అభి నందించారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తిలో నిర్వ హించనున్న అండర్-19 తెలం గాణ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విద్యార్థులు పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ పల్లె రమేష్‌రెడ్డి తెలిపారు.

## బైక్‌ను ఢీకొన్న లారీ.. బాలుడి దుర్మరణం

**తండ్రితో కలిసి వెళ్తుండగా విషాదం**

**లారీ చక్రాల కింద 11 ఏళ్ల బాలుడు**



**చేవెళ్ల /షాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 09 :** లారీ ఢీకొన్న ప్రమాదంలో 11 ఏళ్ల బాలుడు మృతిచెందిన ఘటన షాబాద్ ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. షాబాద్ ఎస్ హెచ్ ఓ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌గూడకు చెందిన వడ్డే రాజు తన కుమారుడు తనుష్ (11)తో కలిసి స్ప్లెండర్ బైక్‌పై షాబాద్ నుంచి నాగర్‌గూడ వైపు వెళ్తున్నారు. తిరుమల వైన్స్ ఎదురుగా రోడ్డుపైకి రాగానే లారీ (ఏపీ 88 వీ 2085) వారి బైక్‌ను ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో తనుష్ లారీ వెనుక చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వడ్డే రాజు రోడ్డుకు ఎడమవైపు పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చేవెళ్లలో మహిళ అనుమానాస్పద మృతి

**చేవెళ్ల, యువ వెలుగు, అక్టోబర్ 09 :** ఫిట్స్‌తో బాధపడుతున్న ఓ మహిళ ఉరేసుకుని మృతిచెందిన ఘటన చేవెళ్ల రెడ్డి కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. బండారి స్నేహలత (29) ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్న స్థితిలో కనిపించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం నానక్‌రామ్‌గూడలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 1.15 గంటలకు మృతిచెందారు. ఫిట్స్ కారణంగా మానసిక ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు ఎలాంటి అనుమానం లేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

**32 కేసులు పరిష్కారం..**

**ఏడుగురికి ట్రాఫిక్ డ్యూటీ.. ఒకరికి జైలు**



**చేవెళ్ల, యువ వెలుగు :** మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. సోమవారం నుంచి గురువారం వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి 32 కేసులను పరిష్కరించారు. కోర్టు ఆదేశాల మేరకు ఏడుగురికి ట్రాఫిక్ డ్యూటీ విధించగా, ఒకరికి జైలు శిక్ష పడింది.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనదారుడితో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానాతో పాటు కోర్టు ఆదేశాల మేరకు జైలు శిక్ష, ఇతర శిక్షలు తప్పవని హెచ్చరించారు.వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# చిలుకూరు పీఏసీఎస్‌ను సందర్శించిన ఖమ్మం జిల్లా సీఈవోలు

**సహకార సంఘాల బలోపేతానికి చిలుకూరు పీఏసీఎస్ ఆదర్శం: శిక్షణ అధికారులు**



**సూర్యాపేట జిల్లా/చిలుకూరు, యువ వెలుగు, అక్టోబర్ 09 :** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)ను గురువారం ఖమ్మం జిల్లాకు చెందిన వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు శిక్షణలో భాగంగా సందర్శించారు.

ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ అలస్కాని జనార్ధన్, సీఈవో లక్ష్మీనారాయణలను కలిసి చిలుకూరు సహకార సంఘంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సేవలు, సంఘం బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంఘం నిధులతో నిర్మించిన నూతన భవనంతో పాటు రైతుల కోసం సంఘం పరిధిలో నిర్మించిన ఎరువుల గోదాములను పరిశీలించారు. చిలుకూరు పీఏసీఎస్ ద్వారా రైతులకు అందుతున్న సేవలు, సంఘం అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన అనంతరం శిక్షణ అధికారులు మాట్లాడుతూ చిలుకూరు సహకార సంఘాన్ని ఆదర్శంగా తీసుకుని ఖమ్మం జిల్లాలోని సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని సీఈవోలకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీఈవోలు మాట్లాడుతూ చిలుకూరు పీఏసీఎస్‌ను సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇక్కడ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి, ఖమ్మం జిల్లాలోని సహకార సంఘాలను కూడా ఇదే తరహాలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు సంపత్‌కుమార్, గౌసియా, కళ్యాణి, ఖమ్మం జిల్లా డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ వేణు, చిలుకూరు పీఏసీఎస్ డైరెక్టర్లు, ఖమ్మం జిల్లా వివిధ సహకార సంఘాల డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ పంజా!

**పొలాల్లో దాచిన బెల్లం వాష్ ధ్వంసం..**

**రెండు కేసులు నమోదు**

**కల్లు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు..**

**నమూనాల సేకరణ**

**అక్రమార్కులకు ఎక్సైజ్ శాఖ హెచ్చరిక..**

**'ఉక్కుపాదం మోపుతాం**



**రామారెడ్డి, యువ వెలుగు, అక్టోబర్ 09 :** గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం, నాటు సారా తయారీ దారుల గుండెల్లో గుబులు పుట్టిస్తూ ఎక్సైజ్ శాఖ మెరుపు దాడులకు దిగింది. నిషేధిత నాటుసారా దందాను వేర్లతో సహా పెకిలించి వేయడమే లక్ష్యంగా రామారెడ్డి మండలంలో ఎక్సైజ్ పోలీసులు గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న దందాపై దాడి:

విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రా మారెడ్డి మండలంలోని కన్నాపూర్, స్కూల్ తండా జగదాంబ, గన్పూర్‌తో పాటు పలు తండాలను జల్లెడ పట్టారు. ముఖ్యంగా కన్నెగూడెం తండా శివారు లోని పొలాలు, అటవీ ప్రాంతాలను క్షుణ్ణం గా తని ఖీ చేశారు. అక్కడ గుట్టుచప్పుడు కాకుం డా ముళ్ల పొదలు, గుంతల్లో దాచిపెట్టిన సుమారు 40 లీటర్ల ఎఫ్‌జే (బెల్లం) వాష్‌ను ఎక్సైజ్ అధికారులు గుర్తించి, అక్కడికక్కడే పారబోసి పూర్తిగా ధ్వంసం చేశారు.ఈ అక్రమ తయారీకి పాల్పడుతున్న వారిపై చట్టపరంగా రెండు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**కల్లు డిపోలు, దుకాణాల్లో తనిఖీలు - కల్తీ చేస్తే కఠిన చర్యలు**

నాటుసారాతో పాటు మండల పరిధిలోని పలు కల్లు దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూ మత్తు పదార్థాలు, రసాయనాలు కలు పుతున్నారా అనే అను మానంతో కల్లు నమూనాలను (శాంపిల్స్) సేకరించారు. వీటిని నాణ్యత, రసాయన విశ్లే షణ కోసం ఫోరెన్సిక్/ల్యాబ్‌కు పంప నున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి కల్తీ కల్లు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేయడమే కాకుం డా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అక్రమ వ్యాపారులపై నిరంతర నిఘా:** ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడు తూ..తండాలు, గ్రామాల్లో నాటు సారా తయారీ, అమ్మకాలు పూర్తిగా చట్టవిరుద్ధం. యువత,కు టుం బాల భవిష్యత్తును నాశనం చేసే ఇలాంటి అసాంఘిక కార్యకలాపా లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షిం చబోం" అని స్పష్టం చేశారు. మం డలంలో అక్రమ మద్యం, గుడుంబా తయారీదారులపై ప్రత్యేక నిఘా ఉంచామని, సమాచారం ఉన్నవారు ధైర్యంగా ఎక్సైజ్ అధికారులకు తెలపాలని కోరారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏపీఎల్‌లో రాజ్‌పుతానా రాయల్స్ శుభారంభం



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 09 :** ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాజ్‌పుతానా రాయల్స్ శుభారంభం చేసిందని నిర్వాహకులు, భారత ఆర్చరీ సంఘం ప్రతినిధులు తెలిపారు. గురువారం హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో జరిగిన తొలి మ్యాచ్‌లో పృథ్వీరాజ్ యోధాస్‌పై 5-3తో విజయం సాధించినట్లు చెప్పారు. రాజ్‌పుతానా తరపున ఓజస్ దియోతలే, ఎల్లా గిబ్బన్, మేటే గజోజ్, అంకితా భకత్ రాణించగా, పృథ్వీరాజ్ తరపున అభిషేక్ వర్మ, మథియాస్ గ్రాండే, ఆండ్రియా బెసెర్రా పోరాడారని పేర్కొన్నారు. భారత ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలోని లీగ్‌లో 6 జట్లు, 48 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, అక్టోబర్ 18న టైటిల్ ఫైట్ జరగనుందని తెలిపారు.

## విద్యార్థులకు యూనిఫాంలు అందజేసిన మున్సిపల్ చైర్మన్




**చిట్యాల, యువ వెలుగు, అక్టోబర్ 09 :** పట్టణ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత యూనిఫాం, షూస్, బెల్టులను పురపాలక చైర్పర్సన్ పందిరి గీతా రమేష్ పంపిణీ చేసి మాట్లాడారు.ప్రభుత్వం పేద విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు యూనిఫాం కిట్ అందిస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఉందనే విషయాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, హెచ్.ఎం సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ దేశపాక లత రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి ఎంఏఓ జి.సరిత



**అడవిదేవులపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 09 :** ఏలినో ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని జి సరిత అన్నారు.మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మండల వ్యవసాయ అధికారి జి. సరిత ఆధ్వర్యంలో విత్తనాలు,ఎరువులు పురుగు మందుల దుకాణ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏఓ జి.సరిత మాట్లాడుతూ రాబోయే యాసంగి సీజన్‌లో ఎలినో ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఆరుతడి పంటలైన పెసలు, మినుములు, బొబ్బర్లు, నువ్వులు మొదలైన విత్తనాలను తగినంత పరిమాణంలో అందుబాటులో ఉంచాలని డీలర్లను ఆదేశించారు.అలాగే వరి పంటకు సంబంధించి కేవలం సన్న రకాల విత్తనాలను మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. విత్తనాలు,ఎరువులు పురుగుల మందుల స్టాక్ రిజిస్టర్లు,బిల్లు పుస్తకాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలి. ఉత్పత్తులను కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదులు బిల్లులు అందజేయాలన్నారు. అన్ని రకాల విత్తనాలు,ఎరువులను కేవలం ఎం ఆర్ పి ధరలకే విక్రయించాలని అన్నారు.హెచ్చు ధరలకు అమ్మినా లేదా నకిలీ ఉత్పత్తులు విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక ఎరువులు, విత్తనాల దుకాణాల డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.

## టీబీ రహిత గ్రామంగా బోయగుబ్బ



**చిట్యాల, యువ వెలుగు, అక్టోబర్ 09 :** చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామ పంచాయతీ టీబీ రహిత గ్రామంగా ప్రభుత్వ గుర్తింపు పొందింది.కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ రేగులగడ్డ స్వామి అవార్డు అందుకున్నారు.అవార్డు అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సహకారంతోనే టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దడం సాధ్యమైందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహనతో ఉండి గ్రామాన్ని ఇదే విధంగా ఆరోగ్యకరంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు.

## ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ శ్రేణులు



**చిట్యాల, యువ వెలుగు, అక్టోబర్ 09 :** కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టును నిరసిస్తూ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశాలనుసారం చిట్యాల పట్టణంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న కోట్లాది ఓట్లను ఎన్నికల సంఘం అడ్డుపెట్టుకుని తొలగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై రాహుల్ గాంధీ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే అరెస్టు చేయించడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన లక్ష్మీ సైదులు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాటం వెంకన్న, వెలిమినేడు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, కౌన్సిలర్లు ఏర్పుల పరమేష్,కుక్కల మోహన్, బొబ్బలి సందీప రామ్ రెడ్డి,నాగిళ్ల సుధాకర్, గాలి యాదమ్మ లింగయ్య,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ, పాటి నర్సిరెడ్డి, ఏఎంసి డైరెక్టర్ కోనతి యాదగిరి, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జయారపు శివ, దాసరి నరసింహ, కొసనం అశోక్, దాసరి వెంకన్న,కళ్లెం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా కలెక్టర్‌కి రాష్ట్రస్థాయి అవార్డు



**నల్లగొండ, యువ వెలుగు, అక్టోబర్ 09 :** సమాచార హక్కు చట్టం అమలులో భాగంగా నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1) బి కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనిపించినందుకు గాను నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఐఏఎస్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ నుండి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 9న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఈ అవార్డును స్వీకరించనున్నారు.జిల్లా కలెక్టర్ కు సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ కలెక్టర్‌గా రాష్ట్రస్థాయి అవార్డు రావడం పట్ల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సమాచార హక్కు చట్టం అసోసియేషన్లు, ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సెయింట్ మార్టిన్స్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు




**సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి.. పూలతో అలంకరించిన బతుకమ్మలు**

**సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి: ప్రిన్సిపాల్ రోహిణి రెమెల్లా**

**హైదరాబాద్, యువ వెలుగు అక్టోబర్ 9 :** చింతల్‌లోని సెయింట్ మార్టిన్స్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుక లను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ జానపద గీతాలు, నృత్యాలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రోహిణి రెమెల్లా మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు. బతుకమ్మ వంటి పండుగలు ప్రకృతిపై ప్రేమను, సామాజిక ఐక్యతను పెంపొంది స్తాయని పేర్కొన్నారు.

విద్యతోపాటు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు తమ విద్యా సంస్థ కృషి చేస్తోందని యాజమాన్యం తెలిపింది. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

## పట్టభద్రుల ఓట్లే కాంగ్రెస్ బలం -సర్వోత్తమ్ రెడ్డి గెలుపు ఖాయం

### కోదాడ పట్టణ అధ్యక్షుడు వంటిపులి వెంకటేష్



**సూర్యాపేట జిల్లా/మునగాల, యువ వెలుగు, అక్టోబర్ 09 :** ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామిరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు రామి రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఉధృతం చేయాలని కోదాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వంటిపులి వెంకటేష్ పిలుపునిచ్చారు. మునగాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సూర్యాపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టభద్రుల ఓటు నమోదుపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వంటిపులి వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా-ఉద్యోగ రంగాల్లో తీసుకుంటున్న నిర్ణయాలు పట్టభద్రులకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. ఈ విషయాలను ప్రతి పట్టభద్రుడికి వివరించి, కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చేయాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ నాయకులపై ఉందన్నారు. అర్హులైన ఒక్క పట్టభద్రుడి ఓటు కూడా మిస్ కాకుండా, ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ఇంటింటికీ తిరిగి ఓటు నమోదు చేయించాలని సూచించారు. ఓటు నమోదు ప్రక్రియ, కావాల్సిన పత్రాలపై కార్యకర్తలకు, పట్టభద్రులకు అవగాహన కల్పించారు. పట్టభద్రులే కాంగ్రెస్ పార్టీకి బలమని, వారి మద్దతుతో రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే సామెల్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తక్కెలపాటి సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, నాయకులు నవీన్ రెడ్డి, ఆంజనేయ శర్మ, తరుణ్, వెంకట్, శ్రీను, మహేందర్, లక్ష్మీనారాయణ, తదితర కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి - జిల్లా కలెక్టర్



**నల్లగొండ, యువ వెలుగు, అక్టోబర్ 09 :** భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించాలన్నా, సొంత కాళ్లపై నిలబడాలన్న విద్యార్థులు బాగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.గురువారం రాత్రి అయన నల్గొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బిసి బాలుర కళాశాల ఏ, బి హాస్టల్ లను ఆకస్మికంగా తనిఖీ చేసి టాయిలెట్లు, డైనింగ్ ,కిచెన్, స్టోర్ రూమ్, తరగతి గదులు, డార్మెటరీలను పరిశీలించారు. విద్యార్థులతో హాస్టల్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌లో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన వంటలను పరిశీలించి మెనూ ప్రకారం వడ్డిస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ప్రేయర్ లో కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు మారాలని, ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని పోటి ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేనట్లయితే జీవితంలో రాణించలేరని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చిన తర్వాత కంప్యూటర్ నేర్చుకోవడం ప్రతి ఒక్కరికి తప్పనిసరి అయిందని అన్నారు. భవిష్యత్తులో ఉద్యోగాలు రావాలన్న, లేదా ఆర్థికంగా సొంతంగా వారి కాళ్లపై వారు నిలబడాలన్న కంప్యూటర్ నేర్చుకోవాలని,ప్రభుత్వం తరపున హాస్టల్ లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, చదువుకునే సమయంలో చదువుకోకుంటే జీవితం వృధా అయిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఏర్పాటు చేసుకున్న శానిటేషన్, ఫుడ్, ఇతర కమిటీలు వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. కాగా కళాశాలలో ఏ హాస్టల్లో 200 ,బి హాస్టల్ లో 200 పైగా విద్యార్థులు ఉన్నారని జిల్లా బీసీ సంక్షేమ అధికారి సంజీవ జిల్లా కలెక్టర్ కు వివరించారు. డిగ్రీ ,బి.ఎడ్, బీటెక్, పీజీ ,ఐటిఐ వంటి కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ హాస్టల్లలో ఉంటున్నారని తెలుపగా కొంతమంది విద్యార్థులతో కంప్యూటర్ సాఫ్ట్వేర్, హార్డ్వేర్, కంప్యూటర్ గురించి కలెక్టర్ ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతి తరగతి గదిలో, అలాగే డార్మెంటరీలో ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూడాలని, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, కాలం చెల్లిన వంట సరుకులు వాడవద్దని వార్డెన్లను ఆదేశించారు.

## హైదరాబాద్‌లో సరస్ మేళాకు సందర్శకుల తాకిడి

**చేనేత వస్త్రాలు, హస్తకళలకు విశేష ఆదరణ**

**మహిళా పారిశ్రామికవేత్త కృష్ణమ్మ ప్రస్థానం స్ఫూర్తిదాయకం**



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 09 :** జాతీయ వార్త ప్రపంచం ప్రతినిధి నగరంలోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న సరస్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన స్టాల్లలో సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆభరణాలు, గ్రామీణ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

తెలంగాణకు చెందిన గద్వాల చీరలు, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు, పట్టు చీరలు, బొమ్మలు, గిరిజన కళాకృతులకు విశేష ఆదరణ లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టెర్రకోట వంటపాత్రలు, అలంకరణ వస్తువులతో పాటు ఉత్తర భారత రాష్ట్రాల హస్తకళలు కూడా సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన కృష్ణమ్మ 30 ఏళ్లుగా టెర్రకోట వ్యాపారం నిర్వహిస్తున్నారు. బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు, స్వయం సహాయక సంఘం రుణాల సహకారంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ప్రస్తుతం సంఘం అధ్యక్షురాలిగా ఇతర మహిళలకు మార్గదర్శనం చేస్తున్నారు.

గ్రామీణ మహిళలకు తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశాలను కల్పిస్తున్న సరస్ మేళా, సంప్రదాయ కళల పరిరక్షణతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతోంది.

## యువత స్వయం ఉపాధి అలమార్చుకోవాలి

**మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్**



**సూర్యాపేట/తుంగతుర్తి, యువ వెలుగు, అక్టోబర్ 09 :** నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అలమరుచుకోవాలని తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నియోజక వర్గ నాయకులు తడకమళ్ళ రవికుమార్ ఇటీవల ఏర్పాటు చేసిన రాయల్ చైనీస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను ఆయన సందర్శించి మాట్లాడారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడుతూనే ప్రత్యామ్నాయంగా వివిధ వ్యాపారాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్,కేతిరెడ్డి గోపాల్ రెడ్డి, తునికి సాయిల్ గౌడ్ గుండ గాని దుర్గయ్య, కొండగడుపుల నాగయ్య, కరుణాకర్, గొపగాని రమేష్ గునిగంటి సంతోష్, ఉప్పుల నాగమల్లు, బొజ్జ సాయి కిరణ్ మల్లికార్జున్, మల్లేష్, మధు, సాయి, గోపి, రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టాస్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి**

**అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి: అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి**



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 9:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో అక్టోబర్ 11 నుంచి నిర్వహించనున్న ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 11 నుంచి 17 వరకు జరిగే పరీక్షలకు హైదరాబాద్ జిల్లాలోని 16 కేంద్రాల్లో మొత్తం 5,614 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. వీరిలో 9 కేంద్రాల్లో 2,870 మంది ఎస్ఎస్సీ, 7 కేంద్రాల్లో 2,744 మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయి. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 23 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, పారిశుధ్యం, ప్రథమ చికిత్స, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. పరీక్షా సామగ్రి సకాలంలో చేరేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు హాల్‌టికెట్, పరీక్ష కేంద్రం వివరాలను ముందుగానే పరిశీలించుకుని, పరీక్ష ప్రారంభానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, టాస్ జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి, పరీక్షల విభాగం సూపరింటెండెంట్ రహీమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అమరుల స్ఫూర్తితోనే ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తాం

**సూర్యాపేట/తుంగతుర్తి, యువ వెలుగు, అక్టోబర్ 09 :** తెలంగాణ రాష్టంలో ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగాలు విలువైనవి అని వారి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తాం అని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్,తుంగతుర్తి నియోజవర్గం ఇంచార్జి సూరారపు కృష్ణవేణి అన్నారు.గురువారం మండల కేంద్రంలో టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుంట్ల కవితమ్మ ఆదేశానుసారం తుంగతుర్తి నియోజవర్గంలో పాంచజన్యం సంకల్ప సభలు, సామాజిక న్యాయ సమావేశాలు ఊరూర నిర్వహిస్తామని చెప్పారు.

**Editor P. Mahesh Goud,** Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : **9908 502 602**